క్లుప్తంగా

అమ్మవార్లకు సారె సమర్పణ

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డు జీరుపేట గ్రామస్తులు శుక్రవారం గ్రామ దేవతలకు సారె సమర్పించారు. పోలమ్మ, ముత్యాలమ్మ, దుర్గాలమ్మ, తోగాలమ్మ, మరిడమ్మ, ఎల్లమ్మ, జోడుగుల్లమ్మ గ్రామదేవతలకు డీజే, బాణసంచాల నడుమ మహిళలు కలశాలు, స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమలను వేర్వేరుగా సమర్పించారు.

పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కొమ్మాది : బెంగళూరులో ఈనెల 15 నుండి 17 వరకు జరిగిన 13వ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో మంగమారిపేట వారీజా నేత్ర విద్యాలయ దివ్యాంగ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 7 బంగారు పతకాలు, ఒక వెండి, 9 కాంస్య పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. వీరిని వచ్చే ఏడాది ఉజ్బెకిస్థాన్‌లో జరిగే అంతర్జాతీయ పారా గేమ్స్ కోసం గ్వాలియర్‌లో జరిగే 90 రోజుల శిక్షణకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్‌స్కూల్ వద్ద ఆదివారం భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, యరబాల ఛారిటీ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. రక్తదానం చేయడమంటే మరొకరి ప్రాణాలను కాపాడడానికి సాయం చేయడమని అన్నారు. రక్తదానం చేసే దాతలకు బహుమతులు ఇస్తామని, ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఇతర వివరాలకు 85002 64289 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విజేతలకు అభినందనలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కొమ్మాది: ఇటీవల బెంగళూరులో జరిగిన నేషనల్ అథ్లెటిక్స్ పారా స్పోర్ట్స్‌లో బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనపరిచి, పతకాలు సాధించారు. ఈ పారా స్పోర్ట్స్‌లో ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలు సాధించి ప్రశంసలందుకున్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న కరుణ కుమారి జావెలిన్ త్రోలో బంగారు పతకం కైవసం చేసుకోగా, షాట్‌పుట్‌లో కాంస్య పతకాన్ని సాధించింది. అదే విధంగా 9వ తరగతి చదువుతున్న కె.సారిక లాంగ్‌జంప్‌లో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జి.తిరుమల ప్రసాద్ అభినందించారు.

దోమల వృద్ధిని అరికడదాం

సీతంపేట: వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా జ్వరాలు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు హరిజన వీధి సచివాలయం పరిధిలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే అమలు తీరును, ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, నీటి నిల్వలను పారబోసి మళ్లీ పట్టుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఫ్రైడే-డ్రైడేను పూర్తి స్థాయిలో అమలు చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టడం తద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాలను నియంత్రించవచ్చని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ కె.ఎస్.ఎస్.రెడ్డి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



కార్‌షెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు



మద్దిలో నీట మునిగిన వరి పైరు



మధురవాడ మార్కెట్ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు



వుడా మైదానం దగ్గర రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

తెరిపివ్వని వాన.. జనం హైరానా

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్వయంకృషినగర్‌లో జారి పడిన కొండ చరియ
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న స్థానికులు

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అన్నట్లుగానే గత రెండు రోజులుగా ఆగకుండా కురుస్తున్న వర్షాలకు భీమిలి, మధురవాడ, తగరపువలసలోని చాలా ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని రహదారులపై వర్షం నీరు నిలిచిపోయి జనం ఇబ్బంది పడ్డారు. వాహన చోదకులు, పాదచారులు సులువుగా రాకపోకలు సాగించలేకపోయారు. వర్షం నేపథ్యంలో జీవీఎంసీ సిబ్బంది రోడ్లపై నిలిచిపోయిన నీటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. గెడ్డలు, వాగుల ప్రవాహాలకు ఎటువంటి అడ్డంకి లేకుండా చర్యలు తీసుకున్నారు.



సబ్బివానిపేట సర్వీస్ రోడ్డులో వర్షం నీటిలోనే వాహనాల రాకపోకలు

మధురవాడ : మధురవాడ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం వేకువ జాము నుంచి ఉదయం వరకు వర్షం దంచి కొట్టింది. లోతట్టు ప్రాంతాలు, శివారు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పగలు పలు దఫాలుగా వర్షం భారీగానే కురిసింది. మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు భారీగా చేరింది. జీవీఎంసీ సిబ్బంది మ్యాన్ హోల్స్ క్లియర్ చేసి వర్షం నీరు తరలించేందుకు ప్రయత్నం చేశారు. వర్షం వచ్చినప్పుడే వీరికి మ్యాన్ హోల్స్ గుర్తుకు వస్తాయి తప్ప.. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో ఎప్పుడూ ఇదే పరిస్థితి అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మధురవాడ డైలీ మార్కెట్, పీహెచ్‌సీ, విద్యా శాఖ ఆర్‌జేడీ కార్యాలయాలకు వెళ్లే మార్గాల్లో భారీగా వర్షం నీరు చేరింది. జీవీఎంసీ 5వ వార్డు వికలాంగుల కాలనీ వద్ద ఓ నివాసానికి ఆనుకుని ఉన్న కొండ చరియ జారిపడింది.



సంగివలస చెరువు అవుట్‌లెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

రహదారి జలమయం

భీమునిపట్నం : భారీ వర్షాల కారణంగా భీమిలి నుంచి తగరపువలస వెళ్లే మార్గంలోని వుడా మైదానం సమీపంలోని రోడ్డుపై శుక్రవారం పెద్ద ఎత్తున నీరు నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో చాలా కాలంగా ఈ సమస్య ఉంది. ఇక్కడ రోడ్డు పక్కన గెడ్డ ఉండడంతో భారీ వర్షాలు పడే సమయంలో అందులోని నీరు రోడ్డుపైకి వచ్చేస్తుంది. కాగా ఇక్కడ రోడ్డు ఎత్తు తక్కువగా ఉండడంతో నీరు నిలిచిపోతుంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. ఇక్కడ ఇలా నీరు నిలిచిపోకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద వర్షం నీటిని తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

నీట మునిగిన వరి పైరు

పద్మనాభం : వర్షానికి పలు గ్రామాల్లో వరి పైరు నీట మునిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్ది, తునిపాలెం, కోరాడ పంచాయతీ గెద్దపేట, కృష్ణాపురం గ్రామాల్లో వరి ఆకు నీట మునిగింది. మరో పది రోజుల్లో ఉభాలు వేయనున్నారు. ఇంతలోనే వర్షం నీట వరి ఆకు మునిగిపోవడంతో నారు కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిత్తడిగా మారిన రహదారులు

పీఎం పాలెం : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారనంగా ఈ ప్రాంతంలోని రహదారులు చిత్తడిగా మారాయి. రోడ్లపై అక్కడక్కడా ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు చేరడంతో పాదచారులు అవస్థలు పడుతున్నారు. గాయత్రీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, బాబానగర్, లక్ష్మీవానిపాలెం, ఆర్‌హెచ్ కాలనీ తదితర ప్రాంతాల్లోని అంతర రహదారుల్లో వర్షం నీరు చేరడంతో స్థానికులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు.

సర్వీస్‌రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

తగరపువలస : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస, సబ్బివానిపేట వద్ద సర్వీస్ రోడ్డుపై రెండు అడుగుల మేర వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. శుక్రవారం సాయంత్రానికి వర్షం తగ్గుముఖం పట్టడంతో రోడ్డుపై నీటిని జీవీఎంసీ సిబ్బంది డ్రైనేజీల ద్వారా మళ్లించారు. ఈ సందర్భంగా ముంపు ప్రాంతాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ ప్రాంతంలో వర్షం నీరు రోజుల తరబడి నిలిచిపోతున్నట్టు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కొరవడిన ఫలితంగా తరచూ ఇక్కడ ఈ సమస్య ఏర్పడుతుందన్నారు. చెరువు కింద రైతులకు ఇబ్బంది లేకుండా అవుట్ ఫ్లో, ఇన్ ఫ్లో లెవల్స్ సరి చేయవలసి ఉందన్నారు. ఈ సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. అలాగే చీకటి పడితే చెరువు పార్కు వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇక్కడ లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గస్తీ పెంచాలని పోలీసులకు సూచించారు. చెరువు లోపల, గట్టుపైనే చెత్త పేరుకుపోయినందున వెంటనే దీనిని శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉండేలా జీవీఎంసీ చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు

పద్మనాభం : అల్ప పీడనం ప్రభావం వల్ల వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు. శుక్రవారం అల్ప పీడనంపై మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఏవో ఎంపీఎస్ చలం, ఈవోఆర్డీ కుమార్, వెలుగు ఏపీఎం ప్రభాకర్, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

తగరపువలస : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ఇద్దరు దొంగలను క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలను మధురవాడ క్రైమ్ సీఐ జి.రాంబాబు, భీమిలి క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాష్ వెల్లడించారు. నగరంలోని ఆరిలోవకు చెందిన బడిగంటి ప్రణీత భీమిలి మండలం దాకమర్రి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 16న దాకమర్రి వద్ద బస్సు దిగి డ్యూటీకి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బుల్లెట్‌పై వచ్చి మెడలో గల అరతులం బంగారు చైన్‌ను తెంపుకుపోయాడు. అలాగే విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన వాడ్రేవు సుజాత ఈ నెల 7వ తేదీన సంగివలస శశి స్కూల్ వద్ద బస్సు కోసం వేచి చూస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో నుంచి 2.50 తులాల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండలో కొంత భాగం తెంచుకుపోయారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు భీమిలి పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముద్దాయిలను పట్టుకుని అరెస్ట్ చేసి వారి నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ముద్దాయిలు నగరంలోని కిన్నెర థియేటర్ ప్రాంతానికి చెందిన గారి గంగులు (ఇతని స్వస్థలం విజయనగరం జిల్లా భోగాపురం మండలం బైరెడ్డిపాలెం), మద్దిలపాలెం శీరపువారి వీధికి చెందిన కోయిలాడ సాయికిరణ్‌లుగా తెలిపారు.

వర్షాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం



కొండపేటలో విద్యుత్ వైర్లపై కూలిన టేకు చెట్టు



వర్షంలోనూ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తగరపువలస: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కొండపేట పంప్‌హౌస్ సమీపంలో టేకుచెట్టు విద్యుత్ స్తంభాలపై కూలడంతో వైర్లు తెగిపడి రోజులో ఎక్కువసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అలాగే చిట్టివలస బాలికల వసతిగృహం వద్ద క్రాస్ ఆర్మ్ విరిగిపోవడంతో వైర్లు వేలాడాయి. దీంతో చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది ఏఈఈ బొట్టా రవి, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో వర్షంలోనూ మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పంప్‌హౌస్ సమీపంలో లైన్ల పునరుద్ధరణ కారణంగా జీవీఎంసీ భీమిలి జోన్‌లో తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా సిద్ధం చేశారు. వర్షాల కారణంగా భీమిలి రోడ్డులోనూ జరిగిన చిన్నపాటి లోపాలను సరిచేశారు. వర్షాల కారణంగా ఎక్కడ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా వెంటనే చిట్టివలస సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు

దాబాగార్డెన్స్: సింహగిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సింహాచలం తొలి పావంచా నుంచి అడవివరం, హనుమంతువాక, విశాలాక్షీనగర్, అప్పుఘర్, ఇసుకతోట, సీతమ్మధార, మాధవధార, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. మేయర్ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని, భక్తుల కు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కేంద్రాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు వంటి ఏర్పాట్లపై మేయర్‌కు అదనపు కమిషనర్ విశ్వనాథన్ వివరించారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, లుంబినీ పార్కు సమీప బీచ్‌లో స్నానమాచరించే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, పలు సేవా సంఘాలకు స్టాళ్ల ఏర్పాటుకు స్థలాలు సూచించామని, ఆహార పదార్థాలు ప్లాస్టిక్‌లో కాకుండా ఆకులు, కాగితంతో తయారు చేసిన ప్లేట్లలో అందించాలని సూచించినట్టు ఆయన తెలిపారు. అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



జోరు వానలో గిరిప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

జగన్నాథపురంలో వైద్యశిబిరం

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయితీ జగన్నాథపురంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో అయిదుగురు వ్యక్తులు డయేరియా బారిన పడటంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. సిబ్బందిని పాఠశాల వద్ద అందుబాటులో ఉంచారు. డయేరియాపై ఇంటింటి సర్వే చేపట్టారు. డయేరియా బాధితుల ఇళ్ల నుంచి రిపోర్టులు సేకరించారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లించి, కొత్త కేసులు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆరోగ్య సిబ్బంది వివరించారు.

130 మందికి వైద్య పరీక్షలు

భీమిలి మండలం టి.నగరపాలెం గ్రామ సచివాలయంలో నగరానికి చెందిన మెడి కవర్ ఆస్పత్రి సిబ్బంది ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 130 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, సన్యాసిరావులు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వీరికి బాయిన మంగరాజు, రాజగిరి రామచంద్రరావు తదితరులు సహాయ సహకారాలు అందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో లో ఓల్టేజీకి చెక్

తగరపువలస: భీమిలి మండల పరిధిలో లో-ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 60 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని భీమిలి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) ఆర్.రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భీమిలి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌లకు 20 కిలోవాట్లు పైబడిన విద్యుత్ లోడ్‌లకు ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా ఎలాంటి విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం లేదన్నారు. మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీ కీతిన్‌పేటలో ఇటీవల ఒక వినియోగదారుడు 16 కిలోవాట్లతో ఏడు విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకున్నారని, ఆ భవన నిర్మాణ మార్గంలో అయిదు నుంచి ఏడు అడుగుల ఇరుకైన రహదారి మాత్రమే ఉందన్నారు. అందువలన దగ్గరలోని ఫీల్డ్ ట్రాన్స్‌ఫార్మర్ 100 కేవీఏ మీద విద్యుత్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ రూల్స్ ప్రకారం మీటర్లు విడుదల చేసినట్లు చెప్పారు. దీనివలన ఈ ప్రాంతంలో లో-ఓల్టేజీ సమస్యలు లేవన్నారు.

శాకంబరిగా దుర్గాలమ్మ

- స్వీట్లు, వంటకాలతో సారె సమర్పణ

మధురవాడ: ఆషాఢ శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో శాకంబరి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మిథిలాపురి వుడా కాలనీకి చెందిన కాయగూరల వ్యాపారి సూరిబాబు, సాయిప్రియ గార్డెన్ వాస్తవ్యులు జక్కం శ్రీధర్, మాలతీ దంపతులు, ఇతర భక్తులు సమర్పించిన వివిధ రకాల కాయగూరలు, ఆకు కూరలు, పండ్లు, కాయలు, వేపాకులతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మ విశేషంగా అలంకరణ చేశారు. ఉదయం 10 గంటలకు చంద్రపాలెం గ్రామస్తులు, ఇతర భక్తులు వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు, పండ్లు, ఫలహారాలతో సారె సమర్పించారు. ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



శాకంబరిగా అలంకరించిన దుర్గాలమ్మ వారికి సమర్పించిన సారె

- మధురవాడ టైలర్స్ కాలనీలోని విజయ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

3 వేల మందికి ఆహార వితరణ

- వర్షాల వేళ ఆదుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు

మధురవాడ: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పనుల్లేక ఇంటికే పరిమితమైన ప్రజలకు వైఎస్సార్‌సీపీ 6వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు, అనూష కేటరింగ్ ప్రొప్రయిటర్ పోతిన ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం భోజనాలు పంపిణీ చేశారు. బక్కన్నపాలెం-2 జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, గాయత్రి నగర్, బక్కన్నపాలెం రోడ్డు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న, రోడ్డు పక్కన ఉన్న సుమారు 3వేలమందికి ఆహారం అందజేశారు.



బక్కన్నపాలెం-2 కాలనీలో ప్రజలకు భోజనం పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

స్వీయ ప్రేరణతో విజయం తథ్యం

మల్కాపురం: జీవితంలో విజయం సాధించడానికి స్వీయ ప్రేరణ ఎంతో అవసరమని సీనియర్ హిందీ అధ్యాపకురాలు ఎ.ఆదిలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు విజయాన్ని సాధించాలనే తపనతోపాటు అవకాశాలను సృష్టించుకో గల శక్తి కూడా కలిగి ఉండాలన్నారు. అడ్డంకులను అధిగమించినప్పుడే దృఢమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందని చెప్పారు. ఇతరుల ప్రోత్సాహం కంటే స్వీయ ప్రేరణ మనలను విజయ శిఖరాలకు చేరుస్తుందన్నారు. అనంతరం మూడు రోజులుగా కళాశాల ఆవరణలో వ్యక్తిత్వ వికాసం, మహిళా సాధికారతపై జరిగిన సదస్సుల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు కళాశాల యాజమాన్యం జ్ఞాపికలను అందించింది.

ఆదాయ పన్నుపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీ అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం ఆదాయ పన్నుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉక్కు పరిపాలన భవనంలోని ప్రధాన కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పన్ను వర్తింపు, సడలింపునకు సంబంధించి ఆదాయ పన్ను శాఖలో ఇటీవల జరిగిన విశేషమైన మార్పులు, పరిణామాల గురించి ఐటీ డిప్యూటీ కమిషనర్ ఐ.మధుసూదనరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.వి.శేషగిరిరావు వివరించారు. ఈ-ఫైలింగ్ చేయడం, డిజిటలైజేషన్ ప్రక్రియ, ముందుగా పూరించిన రిటర్న్‌లలో ప్రతిబింబించే ఆర్థిక సమాచారాన్ని సేకరించడం, డేటా సేకరణ, అప్పీళ్ల దాఖలు, ఆదాయ పన్ను కార్యాలయం సందర్శించకుండా తీసుకున్న వివిధ పద్ధతుల గురించి తెలిపారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులు పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (ఫైనాన్స్) వి.శాంత కుమార్, స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్ట్స్ సీజీఎం ఇన్‌చార్జి డాక్టర్ వి.ఆర్. బాపారావు తదితరులు పాల్గొన్నారు.